క్లుప్తంగా

ఆహ్వాన పత్రిక అందజేత



సబితారెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న అగర్‌మియాగూడ వాసులు

కందుకూరు: మండలంలోని అగర్‌మియాగూడలో నిర్మించనున్న ప్రసన్నాంజనేయస్వామి, భ్రమరాంబ సహిత మల్లికార్జునస్వామి దేవాలయానికి గురువారం శంకుస్థాపన మహోత్సవం నిర్వహించనున్నామని, కార్యక్రమంలో పాల్గొనాలని కోరుతూ ఎమ్మెల్యే సబితారెడ్డికి నిర్వాహకులు ఆహ్వానం పలికారు. నిర్వాహకులు వడ్డేపల్లి రేవంత్‌రెడ్డి, ఈర్లపల్లి భూపాల్ రెడ్డి, లిక్కి జంగారెడ్డి, ఎస్.గణేష్, వి.సంతోష్ రెడ్డి తదితరులు బుధవారం ఆమె నివాసానికి చేరుకుని ఆహ్వాన పత్రిక అందజేశారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్



ఇఫ్తార్ విందులో పీఆర్టీయూ నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: మత సామరస్యానికి ప్రతిక ఇఫ్తార్‌లని పీఆర్టీయూ నాయకులు పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో బుధవారం ముస్లిం ఉద్యోగులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌యాదవ్, మండల అధ్యక్షుడు పరమేశ్, ఉపాధ్యాయులు ఆనంద్, షఫీ తదితరులు పాల్గొన్నారు.

నేడు బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం

మంచాల: మంచాల మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో గురువారం మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు మండల అధ్యక్షుడు పాండాల జంగయ్య గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర నాయకులు బోసుపల్లి ప్రతాప్, గోగిరెడ్డి లచ్చిరెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. సాయంత్రం 4-00 గంటలకు ఈ సమావేశం నిర్వహిస్తారని పేర్కొన్నారు. మండలంలోని నాయకులు, బూత్ స్థాయి అధ్యక్షులు, కార్యకర్తలు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

ఆర్థిక సాయం

తలకొండపల్లి: మండల పరిధిలోని మాదాయిపల్లికి చెందిన బాలనాగమ్మ అనారోగ్యంతో మంగళవారం రాత్రి చనిపోయింది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ మండలాధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. అనంతరం రూ. 3,000లు సాయం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపి అజీజ్, శ్రీనివాస్‌గౌడ్, ఇస్తారి, యాదయ్య, చంద్రయ్య, రవి, భాస్కర్, రామస్వామి, ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

నూతన వధువుకు రూ.10వేలు అందజేత



వధువుకు వివాహకానుక అందిస్తున్న సత్యం

ఆమనగల్లు: శెట్టిపల్లి గ్రామానికి చెందిన నూతన వధువు మౌనిక వివాహం సందర్భంగా మాజీ సర్పంచ్ ఎగిరిశెట్టి సత్యం రూ.10వేలు కానుక అందజేశారు. గత సర్పంచ్ఎన్నికల సమయంలో గ్రామంలోని నిరుపేద యువతుల వివాహాలకు నగదు కానుకగా అందిస్తానని ఇచ్చిన హామీ మేరకు అందజేశారన్నారు. ఇప్పటివరకు 82 మంది యువతుల వివాహాలకు ఆయన అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిని శ్రీనివాస్, కొప్పుల మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్య ఆశయ సాధనకు కృషి

కౌన్సిలర్ కొత్తకుర్మ మంగమ్మ



వర్ధంతి వేడుకల్లో కౌన్సిలర్ మంగమ్మ

తుర్కయంజాల్: తెలంగాణ సాయుధ పోరాట రైతాంగ వీరుడు దొడ్డి కొమురయ్య ఆశయ సాధనకు కృషి చేయాలని కౌన్సిలర్ కొత్తకుర్మ మంగమ్మ పేర్కొన్నారు. బుధవారం తుర్కయంజాల్‌లో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మారెడ్డి, భీంరెడ్డి,రమేశ్ పాల్గొన్నారు.

అందాల 'పెద్ద చెరువు'

- చక్కని వాకింగ్ ట్రాక్, పూల మొక్కలు
- సందర్శకులను ఆకట్టుకునేలా సుందరీకరణ



పూల మొక్కలతో కళకళలాడుతున్న పెద్ద చెరువు

బడంగ్‌పేట్: బాలాపూర్‌లోని పెద్ద చెరువు బడంగ్‌పేట కార్పొరేషన్‌లో ఒక కలికితురాయిగా మిగిలిపోనుందని సందర్శకులు అంటున్నారు. చెరువులో నీరు నిండుగా ఉండి అందరిని ఆశ్చర్యానికి గురిచేస్తోంది. గతంలో రూ.2 కోట్లతో చెరువు సుందరీకరణ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. బాలాపూర్ మండలంలో అన్ని చెరువులను సుందరీకరణ చేశారు. కాని, బాలాపూర్ పెద్ద చెరువును పాలకులు, అధికారులు పట్టించుకోలేదు. దీంతో స్థానిక ప్రజలు పెద్ద చెరువును కూడా అధునీకరించాలని పాలకులకు వినతులు సమర్పించారు. స్పందించిన అధికారులు బాలాపూర్ పెద్ద చెరువును కూడా సుందరీకరణ చేసేలా చర్యలు తీసుకున్నారు. అందుకు సంబంధించి హెచ్ఎండీఏ నుంచి రూ.2 కోట్లు మంజూరు చేయించి పనులు చక్కదిద్దారు. బాలాపూర్ మండలంలోనే ఊహించనంతగా పెద్ద చెరువు రూపురేఖలు మారిపోయాయి. పెద్ద చెరువు కట్టను సుమారు కిలో మీటరు మేర సుందరంగా తీర్చిదిద్దారు. చెరువును వీక్షించేందుకు చుట్టూ పాలీస్ బండలతో వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాట్లు చేశారు.చిన్నారులకు ఏలాంటి ప్రమాదం జరుగకుండా స్టీల్ రాడ్లలతో కంచె ఏర్పాట్లు చేశారు. చెరువు కట్టపై బైకులు వెళ్లకుండా స్పీడ్ బ్రేక్ సంబంధించిన పొడుగు దిమ్మెలను ఏర్పాట్లు చేశారు. పెద్ద అక్షరాలతో బాలాపూర్ లేక్ ఫ్రంట్ పార్కును ఏర్పాట్లు చేసి సందర్శకులు చెరువు అందాలు తిలకిస్తూ ఫొటోలు దిగేలా ఏర్పాట్లు చేశారు. అలసిపోయిన వారు కూర్చోనేందుకు రాతి బల్లలు నిర్మించారు. రాత్రి సమయంలో ఎవరూ చెరువుకట్టపైకి రాకుండా రక్షణగా గేట్లు బిగించారు. ముఖ్యంగా అలుగు పారే దగ్గర, లేక్ వ్యూ వద్ద పచ్చని పూల మొక్కలు నాటి ఆహ్లాదంగా సందర్శకులను ఆకట్టుకునేలా ఉంది. పిల్లలు, పెద్దలతో వీకెండ్‌లో బాలాపూర్ పెద్ద చెరువును చూసేందుకు ప్రజలు ఉవ్విళ్లూరుతున్నారు. ఉరుకుల పరుగుల జీవితంలో సరదాగా ఉదయం, సాయంత్రం మనసు ప్రశాంతత కోసం చెరువును అందాలను తిలకించడం చాలా సంతోషం. పెద్ద చెరువును ఇంత అందంగా తీర్చిదిద్దిన పాలకులు, అధికారులకు సందర్శకులు కృతజ్ఞతలు చెబుతున్నారు.



చక్కని వాకింగ్ ట్రాక్



సందర్శకుల కోసం ఏర్పాటు చేసిన బాలాపూర్ ట్రాక్

దొడ్డి కొమురయ్యకు ఘన నివాళి



కొమురయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కందుకూరు: దొడ్డి కొమురయ్య 97వ జయంతిని పురస్కరించుకుని కురుమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకుడు సత్తయ్య కురుమ మట్లాడుతూ.. భూమికోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడి తెలంగాణ ప్రజల తెగువను, పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన మహనీయుడని కొనియాడారు. ఆయనను కురుమలు ఆదర్శంగా తీసుకుని అన్ని రంగాల్లో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ముచ్చర్ల ఎంపీటీసీ మల్లేశ్, మాజీ సర్పంచ్ ప్రభాకర్, నాయకులు మల్లేష్, శ్రీనుకురుమ, జగదీశ్వర్, అచ్చన పాండుకురుమ, అనిల్, శ్రీనివాస్, కృష్ణయ్య, శివ, సాయికిరణ్, శివకుమార్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలే ఎజెండా

కమిషనర్ సత్యనారాయణ రెడ్డి

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధిలోని అన్ని వార్డుల్లో ప్రజా సమస్యలను ఎజెండాగా పరిగణించి విధులు నిర్వహిస్తామని పుర కమిషనర్ సత్యనారాయణ రెడ్డి తెలిపారు. బుధవారం రాగన్నగూడలోని వార్డు కార్యాలయంలో చైర్ పర్సన్ మల్ రెడ్డి అనురాధ ఆదేశాల మేరకు సిబ్బందితో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి, ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ఎండాకాలంలో తాగునీటి సమస్య రాకుండా జలమండలి అధికారులతో సమన్వయం చేసుకొని విధులు నిర్వహించాలన్నారు. ప్రభుత్వ స్థలాల పరిరక్షణ, పార్కు స్థలాలు, హరితహారం కార్యక్రమంలో చెట్ల రక్షణ అందరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ మల్లిఖార్జున్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, ఇఇ హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తుగా చెల్లిస్తే పన్ను రాయితీ

తెలంగాణ పురపాలక చట్టం-2019 సెక్షన్ 100(1) ప్రకారం 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఇంటి పన్ను 30వ తేదీలోగా ముందస్తుగా చెల్లించే వారికి 5శాతం రాయితీ కల్పించనున్నామని మున్సిపల్ కమిషనర్ బి సత్యనారాయణ రెడ్డి తెలిపారు. కావున ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ఉత్సాహంగా 5కే రన్



ప్రతిజ్ఞ చేస్తున్న ఓటర్లు

ఆర్డీఓ సూరజ్‌కుమార్

తుక్కుగూడ: ఓటర్లు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని కందుకూరు ఆర్డీఓ సూరజ్‌కుమార్ అన్నారు. బుధవారం తుక్కుగూడ మున్సిపాలిటీ కేంద్రంలోని అయ్యప్ప ఆలయం నుంచి ఇమామ్‌గూడ వరకు హెచ్ ఓపీ-2024 ఎన్నికలు ఎస్‌వీఈఈపీ కార్యక్రమంలో భాగంగా 5కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో ఓటర్లకు అవగాహన కల్పించడానికి 5కే రన్ చేపట్టామన్నారు. ఓటర్లు ఎన్నికల సమయంలో ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. అనంతరం ఓటర్లు మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కమిషనర్లు బి.వెంకట్రామ్, చంద్రశేఖర్, రఘు, వాణి, తహసీల్దార్లు, ఎంపీడీఓ, ఆయాశాఖల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌బీనగర్ బిల్‌కలెక్టర్లకు ప్రశంస



బిల్‌కలెక్టర్లకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న గ్రేటర్ కమిషనర్ రోనాల్డ్ రాస్

ఎల్‌బీనగర్: ఇటీవల ముగిసిన ఆస్తి పన్ను వసూళ్లలో ఎల్‌బీనగర్ సర్కిల్-3 అధికారులు, సిబ్బంది పనితీరును గ్రేటర్ కమిషనర్ రోనాల్డ్‌రోస్ ప్రశంసించారు. బుధవారం జరిగిన సమావేశంలో ఎల్‌బీనగర్ సర్కిల్-3 పరిధిలోని అధికారులు సిబ్బంది పనితీరుపై కమిషనర్ సంతృప్తి వ్యక్తం చేశారని డీసీ తిప్పర్తి యాదయ్య తెలిపారు. ఆస్తి పన్ను వసూళ్లలో లక్ష్యానికి మించి వసూళ్లు చేయడంపై కమిషనర్ సిబ్బందిని అభినందించారన్నారు. ఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేసిన ఇద్దరు బిల్ కలెక్టర్లు అర్చన, శివరాజ్‌లను అభినందించి వారికి ప్రశంస పత్రాలు అందజేశారు. భవిష్యత్‌లో కూడా ఇదే స్ఫూర్తితో పనిచేయాలని సూచించారని ఆయన తెలిపారు. ఏర్లీబర్డ్ స్కీంలో ఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేస్తామని డీసీ యాదయ్య అన్నారు. తమ సిబ్బందికి కమిషనర్ ప్రశంస పత్రాలను అందజేయడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ సమావేశంలో జోనల్ కమిషనర్ ముకుందరెడ్డి, ఏఎంసీ శ్రీనివాస్‌గౌడ్, టాక్స్ ఇన్‌స్పెక్టర్ హరికాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేస్తాం



ఇన్ఫర్మేషన్ కాలనీలో డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి

హయత్‌నగర్: డివిజన్‌లోని పలు కాలనీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని, పనుల్లో నాణ్యతను పాటించేలా చర్యలు తీసుకుంటున్నామని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన ఇన్ఫర్మేషన్ కాలనీ పరిసర కాలనీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, కాలనీ మొత్తం డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని, అసంపూర్తిగా ఉన్న రోడ్ల నిర్మాణం పూర్తి చేస్తామని, అవసరమైన చోట్ల వీధి దీపాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. వీధి లైట్లు అవసరం ఉన్న చోటును గుర్తించి కాలనీ వాసులు ఆ వివరాలను తనకు అందించాలని కోరారు. కార్యక్రమంలో జలమండలి అధికారి బాలూనాయక్, కాలనీ నాయకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టిఫిన్ బైఠక్ విజయవంతం చేద్దాం

బీజేపీ మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్



మాట్లాడుతున్న తాండ్ర రవీందర్

యాచారం: పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏప్రిల్ 6న టిఫిన్ బైఠక్ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని బీజేపీ మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బుధవారం ఎంపీ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీయే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ సీనియర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని 24 గ్రామాల్లోని అన్ని బూత్‌ల్లో ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌కు అత్యధిక ఓట్లు తీసుకొచ్చేలా కృషి చేయాలన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పార్టీ శ్రేణులు స్వయంగా వారి ఇళ్ల నుంచే టిఫిన్లు తెచ్చుకుని తింటూ, బూత్‌ల్లో అత్యధిక ఓట్లు సాధించే దిశగా చర్చ జరగాలన్నారు. బూర నర్సయ్య గౌడ్ గెలుపునకు కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు యాదగిరి రెడ్డి, జంగయ్యగౌడ్, రమేష్, శాంతికుమార్, శ్రీశైలం, విజయకుమార్, పాండుచారి పాల్గొన్నారు.

వరికి వడగళ్ల ముప్పు!

- వర్షం కురిస్తే ధాన్యం నేలపాలే
- గింజ గట్టి పడకముందే కోతలు
- భయాందోళనలో అన్నదాతలు



పంటను కోస్తున్న యంత్రం

యాచారం: వరి పంట ఈ ఏడాది రైతుకు గుండె కోత మిగల్చనుంది. ఎండల తీవ్రతతో రోజురోజుకు భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. పాతాళానికి పరుగులు తీస్తున్నాయి. గతేడాది సంవృద్ధిగా వర్షాలు లేకపోవడంతో చెరువులు, కుంటల్లో కూడా నీరు చేరలేదు. దీంతో ఈ యేడు అవి ముందస్తుగానే ఎండిపోయాయి. జిల్లాలో అత్యధిక శాతం వ్యవసాయ పంటలను రైతులు బోరుబావుల ద్వారానే సాగు చేస్తున్నారు. చెరువులు, కుంటల్లో నీరు ఉంటేనే సమీపప్రాంతాల్లో నీటికి డోకా ఉండదు. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదు. జిల్లాలో నాలుగైదు చెరువులు మినాహా నీళ్లు లేక అన్ని ఎండిపోయాయి. నాలుగైదు నెలల కింద చెరువులు, కుంటల్లో నీళ్లు ఉండడం, బోరుబావుల్లో కూడా పుష్కలంగా నీళ్లు ఉండేవి. నీటి సామర్థ్యాన్ని అంచనవేసుకొనే రైతులు వరి, కూరగాయలు, పండ్లతోటలను సాగు చేశారు. జిల్లా వ్యాప్తంగా యాసంగిలో 6 వేల ఎకరాలకు పైగా వరి పంటను సాగు చేశారు. కొద్ది రోజుల్లో వరి చేతికొచ్చే అవకాశమున్న దశలో బోరుబావుల్లో భూగర్భజలాలు అమాంతం పడిపోవడంతో పంటకు నీరు అందని పరిస్థితి దాపురించింది. జిల్లాలోని యాచారం, మంచాల, మాడ్గుల్, కందుకూర్, తలకొండపల్లి, ఆమనగల్ తదితర మండలాల్లో భూగర్భజలాల పరిస్థితి దారుణంగా మారింది. ఆయా మండలాల్లో పక్షం రోజుల వ్యవధిలోనే వందలాది బోరుబావుల్లో నీటి మట్టం తగ్గింది. వందలాది ఎకరాల్లో వరి పంట ఎండిపోయింది.

పచ్చగా ఉండగానే..

ప్రతి యేటా ఏప్రిల్, మేలో వడగళ్ల వర్షం పరిపాటిగా మారింది. వడగళ్లు కురిస్తే పంట పూర్తిగా నష్టపోవడమే కాక గడ్డిని కూడా పశువులు తినని పరిస్థితి దాపురిస్తుంది. తగ్గుతున్న భూగర్భ జలాలతో కళ్ల ముందే చేతికొచ్చే వరి ఎండిపోవడం చూసి తట్టుకోలేని రైతులు గింజలు గట్టి పడకముందే చేనును కోయిస్తున్నారు. యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం, మాడ్గుల్, ఆమన్‌గల్ తదితర మండలాల్లో రైతులు ముందస్తుగానే కోసేస్తున్నారు. ఈ క్రమంలో వరి కోతకు కూలీలు కొరత ఏర్పడుతుంది. కొన్ని గ్రామాల్లో కూలీలు కోస్తుండగా, మరి కొన్ని చోట్ల యంత్రాలతో కోయిస్తున్నారు. కోత యంత్రం ద్వారా గంటకు రూ.1,200ల నుంచి రూ.1,400ల వరకు తీసుకుంటున్నారు. కూలీలతో చేయిస్తే రెండు, మూడు రోజుల సమయం పట్టడం , అదే యంత్రంతో చేస్తే గంటల్లోనే ధాన్యం చేతికొస్తుంది. ప్రస్తుత పరిస్థితులను బట్టి రైతులు ఎక్కువగా యంత్రాలనే ఆశ్రయిస్తున్నారు. వాటితోనే కోతలు చేయిస్తున్నారు. భూగర్భజలాల తగ్గుముఖం పట్టడంతో సగానికి పైగా పంట ఎండిపోవడం వల్ల ఈ ఏడాది వరి సాగు చేసినందుకు అప్పులే తప్పా, మిగులు లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాణాలు లేకుంటే కొనుగోలు చేయలేం..

యాసంగి కింద సాగు చేసిన వరి నాణ్యత ప్రమాణాలు లేకుంటే కొనుగోలు చేయలేమని అధికారులు చెబుతున్నారు. జిల్లాలోని పలు మండలాల్లో ఇప్పుడిప్పుడే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నారు. ఉత్పత్తిలో నాణ్యత ప్రమాణాలపై వ్యవసాయ శాఖ, డీసీఎంఎస్‌లు ఆయా మండలాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ప్రమాణాల బోర్డులు ఏర్పాటు చేస్తున్నాయి. ప్రభుత్వం ఏ గ్రేడ్ వరి ధాన్యానికి క్వింటాల్‌కు రూ. 2,203గా, సాధారణ గ్రేడ్ రకం క్వింటాల్‌కు రూ. 2,183 ధరగా నిర్ణయించింది. కొనుగోలు కేంద్రానికి తెచ్చే వరి ధాన్యంలో తేమ 17శాతం, చెత్త, తాలు 1 శాతం, చెడిపోయిన, రంగుమారిన, మొలకెత్తిన, పురుగు తిన్న ధాన్యాంలో 5 శాతం మించకుండా, అదే సాధారణ గ్రేడ్‌లో 3 శాతం మించకుండా ఉండాలని, తక్కువ రకముల మిశ్రమంలో 6 శాతం మించరాదని నింబంధన పెట్టింది. ధాన్యాన్ని విక్రయించే రైతులు కొనుగోలు కేంద్రానికి వచ్చేటప్పుడు నాణ్యత ప్రమాణాలు పాటించాలి. ఆధార్, పట్టాదారు పుస్తకం, బ్యాంకు ఖాతా జిరాక్స్ పత్రాలను అందజేయాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కోసే ధాన్యంలో నాణ్యత ప్రమాణాలు పాటించడం కష్టమేనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

వడగళ్ల భయం..



ప్రతి యేటా ఏప్రిల్, మేలో వడగళ్ల వర్షం కురుస్తుంది. ఈ ఏడాది కూడా మళ్లీ కురుస్తుందేమోనని భయం వెంటాడుతుంది. గతేడాది సంవృద్ధిగా వర్షాలు కురువకపోవడంతో బోరు బావుల్లో నీటి శాతం గణనీయంగా తగ్గాయి. యాసంగిలో 10 ఎకరాలకు పైగా వరి సాగు చేసేవాడిని, కానీ ఈ దఫా కేవలం మూడు ఎకరాల్లోనే సాగు చేశాను. పంట చేతికొచ్చే వరకు గ్యారంటీ లేదు.

- కలకొండ బీరప్ప, రైతు, నక్కర్తమేడిపల్లి

మొత్తం ఎండిపోయింది..



యాసంగిలో రూ.50వేలు ఖర్చు చేసి మూడు ఎకరాల్లో వరి సాగు చేశాను. ఎండల తీవ్రతకు రెండు బోరుబావుల్లోని నీరు అడుగంటింది. సాగు చేసిన మూడు ఎకరాల్లోని వరి పూర్తిగా ఎండిపోయింది. మళ్లీ ఆశతో రూ. లక్షన్నర అప్పు చేసి రెండు బోరుబావులు తవ్విస్తే చుక్కా నీరు రాలేదు. చేతికొచ్చే సమయంలో వరి పంట ఎండిపోవడం జీర్ణించుకోలేకపోతున్నాం.

- కె కన్నారెడ్డి, రైతు, గునుగల్

నాణ్యత ప్రమాణాలు పాటించాలి



రైతులు కొనుగోలు కేంద్రాలకు తెచ్చే వరి ధాన్యంలో కచ్చితంగా నాణ్యతా ప్రమాణాలు పాటించాల్సిందే. అలా చేస్తేనే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని నింబంధన ఉంది. ఎండల తీవ్రతకు పలు గ్రామాల్లో వందలాది బోరు బావులు వట్టిపోయాయి. నాణ్యతాప్రమాణాలున్న ధాన్యానికి ఏ గ్రేడ్ క్వింటాల్‌కు రూ. 2,203, సాధారణ గ్రేడ్ ధర క్వింటాల్‌కు రూ. 2,183గా నిర్ణయించారు.

-సందీప్‌కుమార్, వ్యవసాయాధికారి, యాచారం

త్వరలో బీఆర్ఎస్ కనుమరుగు

కాంగ్రెస్ నాయకుడు కిషన్ రెడ్డి

మాడ్గుల: రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రాభవం కోల్పోయిందని పార్లమెంట్ ఎన్నికల అనంతరం కనుమరుగు కాక తప్పదని మాడ్గుల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బట్టు కిషన్ రెడ్డి పేర్కొన్నారు. అభివృద్ధిని కాంక్షించి పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలంతా కాంగ్రెస్‌తో కలిసి రావాలని ఆయన పిలుపు నిచ్చారు. మాడ్గుల మండలంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌తోనే అభివృద్ధి, సామాజిక న్యాయం సాధ్యమన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందని, కేంద్రంలో అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఉమ్మడి పాలమురు పార్లమెంట్ స్థానాల్లో భారీ మెజార్టీతో కాంగ్రెస్ కై వసం చేసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

సైబర్ నేరాలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ శివప్రసాద్

కడ్తాల్: ప్రతిఒక్కరూ సైబర్ నేరాలపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని సీఐ శివప్రసాద్ పేర్కొన్నారు. నేరాలను అరికట్టేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నట్లు ఆయన వివరించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రగతి ఉన్నత పాఠశాలలో 'నైతిక విలువలు, కుటుంబ బాధ్యత, క్రమశిక్షణ, టెక్నాలజీ ప్రకారం పిల్లలు చేసే నేరాలు, సైబర్ నేరాలు, ఉన్నత లక్ష్యసాధన' తదితర అంశాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నుద్దేశించి శివప్రసాద్ మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణ ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని గొప్ప లక్ష్యంతో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని సూచించారు. సెల్‌ఫోన్‌ను పరిమితికి మించి వాడటం తగదని, ఆన్‌లైన్ మోసాలను గుర్తించి అప్రమత్తతో ఉండాలన్నారు. క్రమశిక్షణతో చదివి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలన్నారు. తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.